# రామాయణంలో హనుమంతుడు

## ఉషశ్రీ





**ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో, ఎంత మాట్లాడాలో తెలిసిన వాడు హనుమంతుడు.**

రామాయణంలో హనుమంతుని వెంట అనుదినం ఒకగంట తిరుగుతూంటే మన ధీశక్తి వికసించి దానిని ఎదుటివారికి తెలిపే సంభాషణ చాతుర్యం లభిస్తుంది. కిష్కింధలో హనుమత్ప్రవేశం నుండి యుద్ధకాండ చివర రామపట్టాభిషేక పర్యంతం ఈ ధీమంతుని వెంట సావధాన చిత్తులై నడవండి. కొంతలో కొంతయినా మాట్లాడేశక్తి అలవడుతుంది.



5

**కోటను సమీపించాడు.** లోపల అడుగు పెట్టడానికి ద్వారం కోసం చూడకుండా ప్రాకారం నుండి దిగుతూ ఎడమకాలు పెట్టాడు. అది శత్రువు నగరం కనక.

సీతాన్వేషణ ప్రారంభించాడు.

నగర రాజవీధులలో తిరిగాడు.

భవనాలన్నీ అన్వేషించాడు.

అన్వేషిస్తూ అంతఃపురంలోని రాణివాసం చేరాడు.

అర్ధరాత్రి వరకూ పానగోష్ఠిలో ఉండి అలసి నిద్రకు జారుతున్న నారీమణులను చూశాడు.

హంసతూలికా తల్పం మీద నిద్రిస్తున్న మహావీరుణ్ణి చూసి, ఇతడే రావణుడు అయి ఉంటాడు అనుకున్నాడు.

రమణీమణులతో తారా శోభితమయిన గగనంలా ఉన్న ఆ ప్రదేశంలో -

అందరి సౌందర్యాన్నీ తలదన్నుతూ రత్నమాణిక్య ముక్తాహారాలతో అంతఃపురానికే అలంకారంగా సువర్ణ కాంతి దేహంతో నిద్రించే రమణీ మణిని చూసి -

నా జన్మ చరితార్థమయింది జానకీదేవిని చూశాను. రామకార్యం నెరవేరింది అనుకున్నాడు. తోక పైకెత్తి నేలమీద కొట్టి ఆ తోకను ముద్దుపెట్టుకుని నేలమీద దూకుతూ, గంతులు వేస్తూ స్థంభం మీద నుంచి స్థంభం మీదకు దూకుతూ, సంతోషిస్తూ కపి ప్రకృతిని ప్రదర్శించాడు.

"ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం
స్థంభానరోహన్ నిపపాత భూమౌ

నసంద చిక్రీడ జగౌ జగామ

నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనాం"

అలా ఆనందించింది ఒక్క క్షణమే -

మరుక్షణంలో ఆమె రామపత్ని కాదు అని గ్రహించాడు.

సీతాదేవిని అన్వేషిస్తున్న హనుమంతుడు, అంతఃపురంలోని అందరు స్త్రీల సౌందర్యాన్నీ తలదన్నే సౌందర్యంతో ఉన్నది, ప్రత్యేకంగా తీర్చిదిద్దబడిన పర్యంకం మీద నిద్రిస్తున్నది, ఆవిడను అపహరించి తెచ్చిన రావణ రాక్షసుడు సమీపంలోనే ఉన్నాడు, కనక ఆమె సీతాదేవియే అయివుంటుంది అనుకున్నాడు, మండోదరిని చూసి. ఎందువల్లనంటే సీతాదేవిని రావణుడు తన అంతఃపురంలోనే ఉంచే అవకాశం ఉంది, తన రక్షణలో.

మరుక్షణంలోనే మారింది హనుమంతుని ఆలోచనా ధోరణి.

సీతాదేవి పాతివ్రత్యాన్ని గురించి విన్నాడు, మునుపే.

రాముని యందు ఆవిడకు ఉన్న అనురాగం తెలుసు.

అటువంటి అమ్మవారు అన్నపానాలు ముట్టదు. అలంకారాలు దరిజేరనివ్వదు. హంసతూలికా తల్పాలు అధిరోహించదు. అంతఃపురంలో సకల సౌకర్యాలు అనుభవిస్తూ నిశ్చింతగా నిద్రపోలేదు. కాబట్టి ఈవిడ జానకీదేవి కాదు అనుకున్నాడు.

అంతఃపురం విడిచి ముందుకు సాగాడు.

ఆరంభించిన పని పూర్తిచేసినట్లు అనిపిస్తుంది ఒక్కొక్కసారి. ఆ భ్రమలో పడిపోయామో కర్తవ్యదీక్ష సడలుతుంది. అప్పుడు వివేకం పనిచేసి సక్రమ మార్గాన నడపాలి. ఎంతటి ధీమంతుడయినా ఒకొక్కసారి పొరపడతాడు. హనుమంతుడికి కూడా పొరపాటు తప్పనప్పటికీ ధీమంతుడు కనక త్వరలోనే గ్రహించి దిద్దుకున్నాడు.

*<u>అచంచలం</u>*

అన్వేషణ కొనసాగిస్తూ -

పానశాలలోకి ప్రవేశించాడు. హనుమంతుడు అర్ధనగ్నంగా, పూర్ణనగ్నంగా ఉన్నారు అక్కడి నారీజనం.

ఆ స్థితిలో ఉన్న వారిని చూసిన హనుమంతుని మనసు చలించలేదు. చలించలేదు సరికదా పశ్చాత్తాప్తమయింది.

పరస్త్రీ దర్శనమే మహాపాతక హేతువు కాగా ఈ దశలో ఆచ్ఛాదనా రహితులై ఉన్న ఇందరిని చూడడం ఎంత పాపం, అని క్షణం ఆలోచించి -

అమ్మవారిని అన్వేషిస్తూ ఈ పానశాలలో అడుగుపెట్టాను తప్ప వీరి నగ్న సౌందర్యాన్ని వీక్షించడానికి కాదు.

కాక ఈ దశలో ఉన్న ఇందరిని చూసినా నా మనస్సు ఏ వికారానికి లోను కాలేదు. మనస్సు సడలనంతసేపూ ఏ పాపమూ మనల నంటదు అనుకున్నాడు.

మనోహి హేతుఃసర్వేషాం

ఇంద్రియాణాం ప్రవర్తనే

శుభాశుభా స్వవస్థాసు

తచ్చ మే సువ్యవస్థితమ్

ప్రత్యక్షంలో నగ్నసుందరులు.

పరవశింపజేసే పర్యంకాలు

పారవశ్యానికి అవసరమయిన పానపాత్రలు -

అయినా చలించని మనస్సు కలవాడాయన.

హనుమంతుడు ఏ పాన పాత్ర అందుకున్నా ఏ సుందరీమణి మీద చెయ్యి వేసినా అడిగేవారు లేరు ఆ పానశాలలో.

అనుభవించే అవకాశం లేక, అనుభవ సామాగ్రి దొరకక మనస్సును వైరాగ్యంతో నడుపుకునే వారెందరో ఉంటారు.

వయసులో ఉన్నవాడికి కావలసిన సౌకర్యాలన్నీ అందుబాటులో ఉన్నా వాటి వయపు మనసు కదలనివ్వక పోవడంలో ఉంది, వ్యక్తిత్వం.

దార్రిద్యంలో ఉపవాసం గణనీయం కాదు. సర్వసమృద్ధులూ ఉన్నా, జిహ్వా చాపల్యానికి లొంగనివాడే సమర్ధుడు.

ఆ సామర్థ్యాన్ని మనకందించిన మహోన్నత వ్యక్తి హనుమంతుడు.

సీతాన్వేషణా దృష్టి తప్ప మరొక ఆలోచన రానీయడు మనసులోకి.

ఏ పనిమీద మనం ఉంటామో, దానిమీదనే మనస్సు ఏకాగ్రం కావాలి. వ్యామోహాలకూ, ప్రలోభాలకూ లొంగకూడదు. లొంగనివారికే కార్యసిద్ధి కలుగుతుంది.

*నిస్వార్ధత*

పానశాల విడిచి రావణ భవనంలోని లతాగృహాలూ నిశాసౌధాలూ అన్వేషించాడు.

ఆలోచనలో పడ్డాడు.

ఈ లంకలో అంగుళమాత్రం కూడా విడిచి పెట్టకుండా తిరిగి చూశానే ఎక్కడా జానకీదేవి జాడలేదు.

ఈ దుర్బుద్ధి అయిన రావణుని చేతులలో హింసపడడం ఇష్టంలేక ఆ ఇల్లాలు ప్రాణాలు వదిలిందేమో. ఈ క్రూర రాక్షస వికృతాకారాలు చూడడంతో ఆవిడ గుండె ఆగిందేమో.

ఇప్పుడు తిరిగి వెళ్ళి రామభద్రునికి ఏం చెప్పాలి.

జానకీదేవి కనబడలేదనా.

అది వినగానే వియోగభారంతో ఉన్న రామభద్రుడు ప్రాణాలు వదులుతాడు. ఉత్తరక్షణంలో లక్షణస్వామి మిగలడు. ఈ వార్త అయోధ్యనగరం చేరుతుంది. భరత శత్రుఘ్నులు ప్రాణత్యాగం చేస్తారు. కౌసల్య, సుమిత్ర, కైకేయి వారి బంధుపరివారం అందరూ ఆత్మాహుతి చేసుకుంటారు.

ఇక్కడ కిష్కింధలో సుగ్రీవుడు ప్రాణస్నేహితుని మరణాన్ని చూస్తూ బ్రతకగలుగుతాడా! ఆయనతోనే ఆయన భార్య రుమకూడా వెళ్ళిపోతుంది. అక్కడితో ఆగదు. తార, అంగదుడు దేహయాత్ర చాలిస్తారు. ఈ దుఃఖాన్ని భరించలేక మా వానర వీరులందరూ ఆత్మ త్యాగం చేస్తారు.

అయోధ్యలో, కిష్కింధలో, అయోధ్యలో అందరూ నా రాకకోసం ఎదురుచూస్తూ జీవించి ఉంటారు, అని యోచించి, ఆత్మహత్యా సన్నద్ధుడయాడు.

●●●

హనుమంతుని ఆలోచనలో ఎక్కడా తన ప్రాణాన్ని గురించిన ఆలోచన లేదు. కార్యాన్ని సాధించనట్లయితే ఎంతమంది ప్రాణాలు పోతాయో ఆలోచించాడు.

తిరిగి వెళ్ళినట్లయితే.. అనే ఆలోచనలో కూడా స్వార్థం కనపడదు మనకి, వానరులందరూ తన రాకకోసం ఆశగా ఎదురుచూస్తూ జీవించి ఉంటారు అనే ఊహ తప్పు.

ఈ సన్నివేశంలోనే కాదు, రామాయణం మొత్తం మీద ఎక్కడా ఏ పనీ హనుమంతుడు స్వప్రయోజనానికి చేసినట్లు కనపడదు.

## కార్య సాఫల్యం

ఆత్మహత్యా సన్నద్ధుడయిన వాడు మరోసారి ఆలోచించాడు.

శోకానికి హృదయంలో చోటిచ్చామో ఎందుకూ పనికిరాకుండా పోతాం. దాన్ని పరిత్యజించి ఉత్సాహంతో కార్యసాధనకు ఉపక్రమిస్తే ఫలితాన్ని సాధించి శ్రేయస్సును పొందగలుగుతాం.

వినాశే బహవో దోషాః జీవన్ భద్రాణి వశ్యతి!

తస్మాత్ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవతి సంగమః

అని ఆలోచిస్తూ భవనం వెలుపలి ప్రాకారం మీదకి వచ్చి ఎదురుగా దృష్టిని క్రిందికి సారించాడు. కృశించిన వదనంతో, మలిన వస్త్రంతో, రాక్షసజన పరివృతయై, క్రూర మృగాల మధ్య ఆడలేడిలా కనిపించే ఆవిడను చూసి ఈవిడే జానకీదేవి అయి ఉండాలి అనుకున్నాడు.

రామచంద్రుడు చెప్పిన లక్షణాలన్నిటినీ ఏకత్వం చేసుకున్న హనుమంతునికి ఆవిడ నిస్సందేహంగా జానకీదేవియే అనే విశ్వాసం.

ఒక కార్యాన్ని ప్రారంభించినపుడు కార్యసిద్ధికి సంపూర్ణ ప్రయత్నం సాగించాలి.

సంపూర్ణ ప్రయత్నం జరిగింది, అయినప్పటికీ ఫలితం కలగలేదు అని భ్రమపడుతూ ఉంటాం అనేక సమయాలలో.

కాని స్థిరంగా ఆలోచించి చూసినట్లయితే లోపం మన దృష్టిలోకి వస్తుంది. లోపాన్ని సరిదిద్దుకుని పరిపూర్ణ ప్రయత్నం చేసి చూడాలి - అది ఎటువంటి కార్యమయినప్పటికీ.

ప్రయత్నలోపం లేనప్పటికీ, ఫలితం దైవానికి విడిచి పెట్టాలి తప్ప ఆత్మత్యాగమే పరిష్కార మార్గంగా భావించరాదు.

ప్రస్తుత సమాజంలో ప్రతి సమస్యకీ పరిష్కారం ఆత్మహత్య మాత్రమేనన్న ధోరణి ఎక్కువగా కనబడుతున్నది, మనకి.

పరీక్షలో ఉత్తీర్ణులు కాకపోతే ఆత్మహత్య నిర్ణయానికి వస్తున్నారే తప్ప సమస్యని ఏ విధంగా పరిష్కరించి ఫలితాన్ని సాధించగలుగుతాం అని ఆలోచించడంలేదు. ఒక్కసారి ఆత్మత్యాగం చేసిన తరువాత సాధించడానికి మిగిలేది ఏమీలేదు.

తమ సమస్యకి ఆత్మత్యాగం పరిష్కార మార్గం అని హనుమంతుడు భావించినప్పటికీ త్వరపడలేదు.

ఒక్క క్షణంలోనే స్వస్తి పలికాడు ఆ ఆలోచనకి.

మరణించి సాధించగలిగేది ఏమీలేదు, జీవించి ఉంటే ఏ నాటికయినా అమ్మవారిని దర్శించగలను అనుకున్నాడు.

అనుకుని ఎదురుగా దృష్టి సారించాడు.

అశోకవనం కనబడింది.

లంక అంతటా అన్వేషించడం అయిపోయింది. అనుకున్నాడు. అనుకుని ఆత్మత్యాగానికి సన్నద్ధుడయాడు. కాని ధీమంతుడు కనక, ఆ ఆలోచనని ఎక్కువసేపు నిలవనీయలేదు.

నిలవనీయలేదు కనకనే అశోకవనంలో అన్వేషణ జరగలేదనే విషయాన్ని గమనించగలిగాడు.

అక్కడ అమ్మవారిని దర్శించగలిగాడు.

నిలవనిచ్చి ఉంటే సర్వనాశనమే!

స్థిరంగా ఆలోచించి అడుగువేయాలి - అప్పుడే మనకి కూడా హనుమంతుని వలె కార్యద్ధి కలుగుతుంది.

(తరువాయి వచ్చేసంచికలో)

●●●

Comment on this article..

మంచి పుస్తకాన్ని మించిన మంచి బహుమతి లేదు..!

